శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో

**విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ**

రైలు ప్రయాణం.
ఒకే వేగంతో ట్రాక్‌మీద రైలు లయబద్ధంగా శబ్దిస్తూ పరుగులు తీస్తోంది. ఆ శబ్దం చటుక్కున మారి గుండెలదిరేలా శబ్దించింది. కిందికి చూస్తే ఒట్టిపోయినది. దానిమీది వంతెన వెనక్కి నిష్క్రమించింది. ఆ తర్వాత ఏదో చిన్న రైల్వేస్టేషను. దానిని ఆనుకొని చిన్న ఊరు. బొగులు బొగులుమంటూ చిక్కిపోయిన ఇళ్ళు.
ఒకదాని తర్వాత ఒకటి అన్నీ నిష్క్రమించాయి. తిరిగి నిలకడగా లయబద్ధంగా శబ్దం.
కిటికీలోంచి రివ్వున వీచేగాలి...
ఆరుబయల్లో పోతపోసిన ఉక్కుస్తంభాల్లా నిటారుగా నిలిచిన తాడితోపులు.
రైలు తనకు తానే ఒక కోలాహలంలా ధ్వనిస్తోంది. కాలాన్ని తరుముతూ ముందుకు పరుగులు తీస్తోంది.
భూమి గిరగిరా... తాడితోపులూ, గుబురుచెట్లూ వర్తుల వలయంలా – పరుగెత్తే రైలుతో నాలుగు స్తంభాలాట.
రిజర్వేషన్ కంపార్టుమెంటు అంతంత మాత్రమే రద్దీగా వుంది.
బహుశా అమావాస్య కారణం కావచ్చు.
పగలే అయినా మనుషులు జోగుతున్నారు.

# నడిచి వచ్చిన దారి

## ముప్పిడి ప్రభాకర రావు

అక్కడ విండోసీట్లో అటు సుధాకర్‌గారూ, ఇటు రావు గారు. ఆ పక్కనే రజనీ గారు అప్పర్ బెర్తులోని వెంకటేశు మాత్రం గుర్రుపెట్టి నిద్రోతున్నాడు. ఎప్పుడు మెలకువవస్తే అప్పుడు కిందకి వంగి సుధాకర్ గారినో రజనీగారినో ఏ స్టేషనూ? అని అడుగుతాడు. తిరిగి నిద్రలోకి జారుకుంటాడు.

అక్కడ వాళ్లతోపాటే ఓ వృద్ధురాలు – కడిగిన ముత్యమల్లే వుంది. పేరు సుందరమ్మగారట ఎక్కడ నుండి ఎక్కడకు వెళ్తున్నదో తెలియదు. బహుశ చెన్నైకేమో... అటు సైడు బెర్తుమీద ఎవరో ఓ విదేశీ వనిత. ఎవర్నీ పట్టించుకున్నట్టు లేదు.

వెంకటేశు పైనించి మరోసారి టైమెంతయిందీ అని అడిగాడు. మూడు కావస్తోంది మిత్రమా... కిందకు దిగితే టీ తెప్పించుకోవచ్చు...

ఝుక్‌ఝుక్... ఝుక్ ఝుక్.... ఝుక్ ఝుక్...

రైలు గుండె చప్పుడు ఆహ్లాదంగా వినిపిస్తోంది.

మనిషికీ పశువుకీ ఉన్నట్టే, పువ్వుకూ పండుకూ ఉన్నట్టే రైలుకూ ఒక ప్రత్యేక వాసన.

అప్పుడు ఆ రైలు వేగంలో ఓ చిన్నకుదుపు. గుండె లయ తప్పింది.

లబ్‌డబ్... లబ్... డబ్... ల... బ్.... డ.... బ్....కిర్ర్ర్.

రైలు ఆగిపోయింది.

ఏ స్టేషను? పైనుండి మిత్రుడు వెంకటేశు.

ఏ స్టేషనూ లేదు, అర్ధాంతరంగా ఇక్కడెక్కడో ఆగిపోయింది.

ఏదన్నా క్రాసింగో ఏమో!

ఇక్కడ క్రాసింటేమిటి? స్టేషనే లేందే...

అయితే ఏ గొడ్డో గోదామో పట్టాలకింద పడుంటుంది. చూశారా – కిటికీలోంచి తొంగి చూశారు సుధాకర్‌గారు. అలాంటిదేమీ జరిగినట్టు లేదు.

ఏమండీ రావుగారూ.... నైట్స్ మీల్సట... ఆర్డరిద్దామా? బుక్కింగ్ అతను వచ్చాడు. అలాగే ఓ నాల్గు మీల్సు బుక్ చేయండి. ప్రస్తుతానికి టీ గట్రా కాస్త సప్లయ్ చేయగలడేమో చూడండి.

ఆ బుక్కింగ్ అతను ఓ కుర్రాణ్ణి పురమాయించాడు.

రావుగారు అసహనంగా వున్నారు. గడియారం చూసుకుని, అరగంట దాటి పోయింది. ఎప్పటికి కదుల్తుంది...

ఆ కుర్రాడు రైలేనా సార్... ఇప్పుడు కదల్దుసార్. ఓ నాలుగైదు గంటల తర్వాత కదిల్తే ఇప్పుడు కదిల్నట్టే సార్...

ఏమయిందట?

ఇంజన్ ట్రబుల్ సార్... వేరే ఇంజను రావాలట. లోకోషెడ్‌కు మెసేజ్ వెళ్లింది సార్.

సుధాకర్‌గారూ! ఎప్పటికి చేరతాం మనం? చివరి చూపయినా మిగుల్తుందంటారా ఈ లెక్కన–

శశాంక మనసులో మెదలగానే అందరకూ శూన్యం అనుభవంలోకి వచ్చింది.

శూన్యం మృత్యువు.

అర్ధరాత్రి కబురు తెలిసినప్పటినుండీ వాళ్లందరూ అదే శూన్యంలో వున్నారు. అందుకే ఈ అత్యవసర ప్రయాణం.

నీ పేరేంటి?

శంకర్ అంటారు సార్...

'టీ' తర్వాత తెద్దువుగానిలే గాని, ముందు ఓ నాలుగు ప్లేట్లు స్నాక్స్ తీసుకురా అన్నారు రజనీ గారు. అలా వెళ్లిన శంకర్ ఇలా వచ్చి అన్నీ ఓ అరగంటలో సర్వ్ చేసేసి చకచకా వెళ్లిపోయాడు అతడు.

కుర్రాడు మంచి చలాకీగా ఉన్నాడే అని సుధాకర్

గారు శంకర్‌ను తెగ మెచ్చుకున్నాడు.


కదలిక లేని రైలు.

బయటకు చూస్తే ప్రకృతి అందమే అందం. కనుచూపుమేర పచ్చని తివాచీలు పరిచినట్టు హరిత ధరిత్రి.

ఇప్పుడేం చేయాలి? నాలుగైదు గంటలా... అమ్మో!

కాలం స్తబ్దుగా.... బహు నిర్జీవంగా–

వెంకటేశు పై బెర్తుమీంచి కిందికి దిగాడు. కిటికీలోంచి ఆరుబయలు కేసి పరిశీలనగా చూశాడు. ఎదురుగా భూమ్యాకాశాలు కలిసిన దిఙ్మండలం తప్ప మనుషుల ఆవాసాలెక్కడా అతడికి కనిపించలేదు. అవతలివేపు కిటికీల కేసి వెళ్లి కూడా చూశాడు. అక్కడా అంతే అంతా హరితఎడారి. ఆ తర్వాత అతడు కంపార్టుమెంటులో ఈ చివరినుండి ఆ చివరకూ ఆ చివరి నుండి ఈ చివరకూ తిరిగాడు. బహుశ అతని మనసులో ఏదో ఆలోచన మెదిలి వుంటుంది. అది అతనికి తప్ప మిగతా వారికది తెలియకపోవచ్చు.



సూర్యుడు ఎర్రబడి కిటికీ ఫ్రేములో కొచ్చి నిలిచాడు. సాయంత్రపు నీరెండ కంపార్టుమెంటులో మిలమిలా మెరిసింది.

కంపార్టుమెంటు చివర డోర్‌వద్ద కలెక్షన్ లెక్కచూసుకుంటూ శంకర్ కనిపించాడు. వెంకటేశు అతడి దగ్గరకొచ్చి శంకరూ అన్నాడు.

ఎందుకుసార్...

నీతో పనొచ్చిందోయ్.

ఏమిటో చెప్పండి సార్...

ఇక్కడ దగ్గర్లో ఏదయినా ఊరుందా?

దేనికిసార్...

ఊళ్లోకి వెళ్ళొద్దామని...

జోకా సార్...

భలే వాడివోయ్... జోక్ కాదు, నిజంగానే. కదలని ఈ రైల్లో కూచొని ఎన్ని గంటలు గడపాలి? బోర్‌కదా– అందుకని ఏదయినా దగ్గర్లో ఊరుంటే వెళ్ళొద్దామని.

అంటే షికారుకా సార్! ఈ బోదెలూ, పొలాలూ, వాటిగట్లు దాటుకుని వెళ్దామనేనా సార్... అయినా ఇక్కడ ఓ ఊరా ఓ వల్లకాడా? ఎక్కడికని వెళ్తారు సార్?

ఈ రైలు ట్రాక్ వెంబడే కిందికొకసారి చూడు.

ఎందుకు సార్... అన్నీ పచ్చని వరి పొలాలేగా–

ఇంకా ఇవతల–

ఆ పల్లాల్లో నీటికుంటలున్నాయి. అందులో అల్లీబిల్లీగా అలుముకున్న తూటు కాడలున్నాయి. అందులో తామరాకులున్నాయి. వాటి మధ్యలోంచి నిటారుగా లేచిన తెలతెల్లని తామరపూలున్నాయి. ఇంకా చెప్పమంటే అవి పూలో తెల్లని కొంగలో పోలిక దొరకని వలప పక్షులున్నాయ్–

వెంకటేశు చిన్నగ నవ్వి

చాలు చాలు

అన్నాడు.

ఈ ట్రాక్ వెంబడే నలిగిన సన్నని కాలిబాటుంది. అంటే దగ్గర్లో ఓ ఊరుందన్న మాట. వంతెన దాటాకా ఓ ఊరు దాటి వచ్చాం కదా!

అది దగ్గరేం కాదు సార్. చాలాదూరం వచ్చేశాం. కనీసం పది కిలో మీటర్లుంటుంది సార్– అయినా ఈ కాలిబాట మీదా, రైలు ట్రాక్ మీదా మీరసలే నడిచి వెళ్లలేరు సార్–

అంతేనంటావా? నేను కాకపోతే పోనీ నీవు వెళ్లొస్తావు.

నేనా? అదేంటి సార్... దేని కోసం?

ఓ బాటిల్ దొరుకుద్దేమోనని... కాలం గడవాలంటే ఏదయినా కాస్త వ్యాపకం కావాలి కదా మరి.

ఇక్కడా? ఊరూ వాడా గాని ఈ ప్రదేశంలో మీ కోసం ఓ బాటిలా? ఏదయినా ఓ అద్భుతం జరగాలి సార్...

అంతేనంటావా?

వెంకటేశు నిరుత్సాహంగా వెనుదిరిగాడు.

ఏ చలనమూ లేని రైలు శూన్యంలాంటి మౌనం దాల్చింది.

సుధాకర్‌గారు ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నారు. రావుగారయితే అటూ ఇటూ నిర్లిప్తంగా చూస్తున్నారు. రజనీగారు పక్కనే వున్న సుందరమ్మ గారితో ఏవో ముచ్చట్లు పెట్టుకున్నారు.

సెకనులు నిమిషాలయ్యాయి. నిమిషాలు గంటలయ్యాయి.

సూర్యుడు మరింత కిందకు జారిపోయాడు.

అదిగో అప్పుడు తిరిగి మరోసారి ప్రత్యక్షమయ్యాడు శంకర్. ఎక్కడయినా ఓ అద్భుతం జరగాలని కలలు కంటున్న వెంకటేశుకు శంకర్ రాకతో మనసులోని ఆశ తళుక్కుమని మెరిసింది.

శంకర్ వెంకటేశును పక్కకు పిలిచి, ఇప్పుడే ఫస్ట్ క్లాస్ ఏసీలో ఓ పెద్దాయనకు ఫుల్ బాటిల్ సీలు విప్పి గ్లాసులో ఓ పెగ్ వొంపి, అన్నీ సర్దిపెట్టి మీ కోసం ఇటొచ్చాను సార్... ఆయన ఏ మిలిటరీ ఆఫీసరో అయ్యుండొచ్చు. ఓ కేస్ నిండా అలాంటి ఫుల్ బాటిల్సే వున్నాయి. మీరడిగితే కాదనక పోవచ్చు. మీరోసారి నాతో వస్తే చూపిస్తాను అన్నాడు.

వెంకటేశు ఎగిరి గంతేసినంత పనిచేశాడు. ఈ అవకాశాన్ని ఎలాగయినా చేజార్చుకోగూడదనుకున్నాడు. కాసేపు వెళ్లాలా వద్దాని ఊగిసలాడాడు. చివరకు ఓ ఐదు వందల నోటు తీసి శంకర్ జేబులో కుక్కి అవన్నీ నీవే చూసుకో అని భుజం తట్టి పంపించాడు.

అదిగో అలా ఓ ఫుల్‌బాటిల్ లభించగా, రావుగారితో సహా అందరూ ఇది కలా నిజమా అన్నంతగా ఆశ్చర్యపోయారు. ఈలోగా శంకర్ వచ్చి కావలసినవన్నీ అందుబాటులోకి తెచ్చి చక్కగా సర్ది వెళ్లిపోయాడు.

బోగీలో తిరిగే జనం.

సుందరమ్మ గారయితే మరీ పక్కనే ఉన్నారు. ఆమె ముందూ, జనం ముందూ బాటిల్ ఓపెన్ చెయ్యాలంటే ఏదో అపరాధ భావన వాళ్లను ఇబ్బంది పెట్టింది. వెంకటేశు కాస్త చొరవ తీసుకుని, గొంతు తగ్గించి ఆమెతో మాట్లాడసాగాడు. ఆమె అంతావిని మీరూ మా అబ్బాయి లాంటివారేను, వాడూ వాడి స్నేహితుల్తో అప్పుడప్పుడూ యింతే.... యిందులో కొత్తేముంది?... నేనక్కడ కూచోనా అంటూ లేచి సైడు బెర్తుమీద విండో సీట్లోకి వెళ్లిపోయింది. ఆమెకు ఎదురుగా ఆ విదేశీ వనిత –

అంతా ఎక్కడివాళ్లు అక్కడే సెటిల్ అయ్యాక వెంకటేశు బాటిల్‌పై చుట్టిన రేపర్‌ను తొలగించాడు.


“పీటర్ స్కాట్” అని అందరూ ఒక్కసారిగా ఆనందపడిపోయారు. డిఫెన్సు సర్వీసెస్ కోటాదది.

అందమైన పేపర్ ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు అందరి చేతుల్లోకి చేరాయి. ఒక్కొక్క పెగ్‌చొప్పున విస్కీ అందులో వుంది. చల్లని మినరల్ వాటర్‌తో అంచుల వరకూ వాళ్లు నింపుకుని గ్లాసులు పైకెత్తారు. కాని ఒక అత్యంత విషాదాత్మక సందర్భంలో వాళ్లు “ఛీర్స్” అని ఎలా చెప్పుకోగలరు.

శశాంక గుర్తుకొచ్చాడు.

శూన్యం వాళ్లను ఒక్కసారిగా ఆవహించింది. ఒక పాటి నిస్పృహతో ఎత్తిన చేతులు కిందికి దిగిపోయాయి.

రావుగారు నెమ్మదిగా ఆ పరిస్థితిలోంచి తేరుకుని, మనమిత్రుడు శశాంక ఒక విశిష్ట వ్యక్తి, కీర్తినీ, ఆడదాన్నీ ఆయన దూరంగా వుంచి, మార్క్సిజాన్నీ మందునీ అమితంగా ప్రేమించినవాడు. మిత్రుల్తో ఉత్సాహంగా పార్టీలు చేసుకునేటప్పుడు అతడు హాయిగా నవ్వుతూ అనేవాడు, “తాను చనిపోయాక తన పార్థివ కాయం మీద నాల్గు విస్కీ చుక్కలు చల్లి, మరో నాల్గు చుక్కలు నోట్లో పోసి, పాడినెత్తండని...”



కనుక...

“ఇంద నేమ్ ఆఫ్ శశాంక, లెట్ హిజ్ సోల్ రెస్ట్ ఇన్‌పీస్” అని రావుగారు తన గ్లాసును పైకెత్తారు. అంతా టోస్ట్ చెప్పి, చిన్నగ సిప్ చేసి మౌనం వహించారు. అలా ప్రారంభమై ఒక సిప్ తర్వాత మరో సిప్... మరో సిప్...

కాని మందు మౌనంగా ఉండనిస్తుందా? నిర్లిప్తతనీ, నిస్తేజాన్నీ పటాపంచలు చేసింది. ఎన్నో ఊసులు.

అలా మొదటిరౌండు ప్రారంభమయింది.

సుధాకర్‌గారు కాస్త మూడీగానే కనిపిస్తున్నారు. గ్లాసు సగం కూడా ఖాళీ అయినట్టు లేదు. అప్పుడు వెంకటేశు ఏంటి సుధాకర్‌గారూ, మీ గ్లాసు కదలటం లేదు అన్నాడు.

ఓ ఆత్మీయ మిత్రుడి గూర్చి బాధపడాల్సిన సందర్భంలో మనం యిలా ఖుషీగా గడపటం ఏమంత సబబు అన్నారు. సుధాకర్‌గారి గొంతు ఆర్ద్రతతో పూడుకు పోయింది. కళ్ల వెంట నీరు బొటబొటా కారాయి.

సుధాకర్‌గారు డిప్రెషన్‌కు లోనయ్యారని వాళ్లంతా అనుకున్నారు. ఆ తర్వాత కొన్ని క్షణాలపాటు అక్కడ నిశ్శబ్దమేలింది – అంతవరకూ మౌనంగా వున్న రజనీగారు పరిస్థితిని అర్థం చేసుకుని, సుధాకర్ గారూ! మిత్రుడు శశాంక మరణించాడన్నది ఒక వాస్తవం. మనిషి పోగానే మనకు వచ్చే కన్నీళ్లు మన మనసును ప్రక్షాళన చేస్తాయి. మనసులోని మలినాలను కడిగి పారేస్తాయి. శశాంక మరణించాడనగానే అతనిలోని సుగుణాలన్నీ ఒక్కసారిగా మనలను చుట్టుముట్టి మనల్ని మరింత కుంగదీశాయి.

సుధాకర్‌గారూ! మనల్ని మనం సంపూర్తిగా వ్యక్తపరుచుకునే ఉద్వేగం దుఃఖం మాత్రమే. అది కన్నీళ్లలోనే వుంది. నీతి నిజాయితీల్లో కల్తీ ఉండొచ్చు. మాటల్లోనూ, చేతల్లోనూ కల్తీ ఉండొచ్చు. కాని కన్నీళ్లలో కల్తీ ఉండదు సుధాకర్‌గారూ–

శశాంక పట్ల మీ హృదయంలో ఎంతటి ప్రేమాభిమానాలున్నాయో... శశాంక బతికుండగా ఎప్పుడయినా ఈ విషయం ఆయనతో చెప్పారా? చెప్పరు. ఇప్పుడు శశాంక మరణించాక ఆ విషయం చెప్పడానికి అతనున్నాడా? లేడు. కనుక శశాంక గురించి ఇప్పుడు కన్నీరు కార్చటం నిష్ప్రయోజనమే కదా....

చావునూ పుట్టుకనూ ఒక దాని నుండి ఒకటి వేరు చేయడం ఎవరితరమూ కాదు సుధాకర్‌గారూ.... అన్నారు రజనీగారు.

సుధాకర్‌గారు ఉద్వేగం లోంచి తేరుకున్నారు. ఆయన ముఖం ప్రసన్నమయింది. 'సారీ' అంటూ గ్లాసును అందుకుని అందరితోపాటు తనూ సిప్ చేశారు.

అలా మొదటి రౌండు పూర్తయింది.

అప్పుడక్కడ రావు గారు ఒకింత వ్యాకులపడి రజనీగారూ! మనం ఇక్కడ ఎవరికన్నా ఇబ్బంది కలుగచేస్తున్నామేమో గమనించారా అన్నారు.

అందరి ముఖాలూ రావుగారి కేసి తిరిగాయి.

అదిగో.... ఆ విదేశీ వనిత – ఆ కిటికీ వద్ద – అప్పుడప్పుడు ఇబ్బందిగా ఇటుకేసి చూస్తోంది.

అలానా? మేమెవరమూ అది గ్రహించలేదే–

లేదు లేదు... ఆమె మనకేసే చూస్తోంది. ముందస్తుగా మనం ఆమెతో ఓ మాట చెప్పుండాల్సింది. ఆమెకు అభ్యంతరమైతే డ్రింక్ చేయం అని. ఈ విదేశీయుల ప్రవర్తన భలే విచిత్రంగా వుంటుంది. ఎదుటి వాళ్లు ఎక్కడ ఇబ్బంది పడతారోనని ప్రతి చిన్నదానికీ సారీ, ఎక్స్‌క్యూజ్‌మీ అంటూ తెగ ఇబ్బంది పడిపోతూ వుంటారు. కాని మనవాళ్ల కవేమీ పట్టవుగాక పట్టవు. ఈ ఇండియన్స్ సంస్కారం తెలియని వాళ్లని అనుకుంటుందో ఏమో!

అభ్యంతరమని ఇప్పుడు మాత్రం ఆమె మనతో చెప్పలేదుగా అన్నాడు వెంకటేశు.

ఆమె చూపులే చెప్తున్నాయి.

మీరు అవసరం అనుకుంటే ఇప్పుడయినా ఆమెతో మీకు అభ్యంతరమా? అని అడగొచ్చు.

రావుగారు కదిలారు.

అక్కడ ఆ కిటికీ అవతల సూర్యుడు కెంపులుదేరి కుంగిపోతున్నాడు. వాలి పోయిన ఆ సంధ్య కిరణాలు అందమైన ఆమె ముఖం మీద వొంపులు తిరిగి హొయలు పోతున్నాయి.

రావుగారు ఆమెతో ఏమి సంభాషించారో ఏమో గాని, కాసేపటికి ఆయనతో పాటే ఆమె లేచి వచ్చి వాళ్ల ముందు నిలుచుంది.

ఆమెకేసి వాళ్లంతా ఆశ్చర్యంగా చూశారు. బహుశా ఆమె అలా వస్తుందని వాళ్లెవరూ ముందుగా ఊహించినట్టు లేరు.

''అయామ్ రెబెక్కా ఫ్రమ్ జర్మనీ'' అని మిలమిలా మెరిసే నీలికళ్లతో మంద హాసం చేస్తూ తనను తాను పరిచయం చేసుకుంది. ఆమె భారతీయ సంప్రదాయం ఉట్టిపడేటట్టు తన రెండు చేతులూ జోడించి నమస్కరించింది. ఆమె వేసుకున్న తెల్లని చుడీదార్ ఆమె అందమైన ఆకృతికి అదనపు ఆకర్షణ నిచ్చింది. ఓ భారత స్త్రీలా ముగ్ధమనోహరంగా రూపు దాల్చుకుంది.

అప్పుడు రావుగారు రియల్‌ఎస్టేట్ బిజినెస్ మేన్ వెంకటేశునూ, సివిల్ ఇంజనీర్ సుధాకర్‌రావు గారినీ, బేంక్ మేనేజర్ రజనీకుమార్ గారినీ పరిచయం చేయగా అందరూ ఆమెతో కరచాలనం చేసి కూచున్నారు.

ఇంతకూ ఏం హిప్నటైజ్ చేశారు. అమ్మాయి వెంటబడి వచ్చింది? అన్నారు రజనీగారు.

మనం మర్యాదస్తులమనుకుని.... అన్నారు రావుగారు.

ఇప్పుడక్కడ అలా ఓ కొత్త వాతావారణంతో ఆహ్లాదంగా మారిపోయింది. గుండెల్లో గూడు కట్టుకున్న మృత్యునైరాశ్యాన్నీ పటాపంచలు చేసింది. అప్పుడు వెంకటేశు ఓ మినరల్ వాటర్ బాటిల్ ఆమెపక్క నుంచాడు. ఓ పేపర్ ప్లేటులో కొన్ని స్నాక్స్ వేసి ఆమె చేతికందించాడు.

అందరి గ్లాసుల్లోనూ విస్కీ చేరింది. రెబెక్కా చేతికీ ఒక గ్లాసు వచ్చింది. అందరూ గ్లాసులు పైకెత్తి రెబెక్కాకోసం ప్రత్యేక టోస్టీ చెప్పారు. అదే సమయంలో కంపార్టుమెంటులోని లైట్లు గుప్పున వెలిగాయి.

ఆ ఆహ్లాదకరమైన వాతావరణంలో బెరుకు బెరుగ్గా మొదలైన మాటలిప్పుడు చురుగ్గా సాగాయి. ఆమె పై ప్రశ్నల పరంపర.

ఏ పనిమీద ఈ దేశం వచ్చారు?

టు లెర్న్ యోగా –

ఈ దేశం మీకు నచ్చిందా?

ఐ లవ్ ఇండియా–

ఇక్కడి ప్రజలు

ఓ వెరీ నైస్ పీపుల్–

నగరాలు చూసినట్టున్నారు... ఎలా వున్నాయి?

రియల్లీ ఫెంటాస్టిక్–

క్లైమేట్ మీకు సరిపడిందా?

ఓ! ప్లెజెంట్...

ఈమె అన్నింటికీ వండర్‌ఫుల్, ఫెంటాస్టిక్ అంటూ పోజిటివ్‌గా సమాధాన మిస్తోంది.... అని రావుగారు అర్థోక్తిగా నవ్వారు. అప్పుడు రజనీగారు అందుకుని, ఇండియాను ఎలా ద్వేషించాలో ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు లండన్‌లో నేర్చుకుని ఇండియా వచ్చేవారట. ఆ విదేశీయులే ఇప్పుడు ఇండియాను మార్వలెస్, ఫెంటాస్టిక్ అంటున్నారు అన్నారు.

ఈ విదేశీ వనిత కూడా, మరో రౌండు అయితే నిజం మాట్లాడుతుందేమో?

మన చెవులు పొగడ్తలకు అలవాటు పడ్డాయి. నిజాన్ని వినలేవేమో...

ఆ తర్వాత ఎన్నో కబుర్లు...

అక్కడ చిమ్మచీకట్లో ఎక్కడా మనిషి సంచారమే లేని నిర్జన ప్రదేశంలో పట్టాల మీద నిలిచిన రైలు. బయట ఎగిరే నిప్పురవ్వల్లా మిణుగురులు. నిశ్శబ్దాన్ని చీల్చే కీచురాళ్లు... కంపార్టుమెంటులో వెలిగే విద్యుద్దీపాలకు పచ్చని వరి పొలాల మీంచి మిడతలూ, పసిరి పురుగులూ కంపార్టుమెంటులోకి దండెత్తాయి. బోగీలోని కిటికీల షట్టర్లన్నీ కిందికి దిగిపోయాయి.

మిసెస్ రెబెక్కా తన గ్లాసును ఖాళీ చేసింది. అలాగే అందరూను.

బోగీ లోపల జనం అటూ ఇటూ తిరుగుతున్నారు. అక్కడకు రాగానే వింత చూపులు – కొందరి అడుగుల్లో తడబాటు – మరికొందరి అడుగుల్లో బ్రేకులు.

ఇది గమనించిన వెంకటేశు లేచి ఓ బెడ్‌షీట్‌తో అప్పర్ బెర్తులు రెంటినీ కలిపి చివరలు ముడివేసి ఓ కర్టెన్‌లా వేలాడదీశాడు. జనం నడిచే పాసేజ్‌తో అదిప్పుడు వేరయింది. కొంత కనుమరుగయింది.

మూడవ రౌండు ప్రారంభమయింది.

ద్రవ, ఉపద్రవాల మధ్య ఆ నలుగురూ – వాళ్ళ మధ్యఆమె...

షల్ ఐ విట్ ఎ సిగరెట్ – అంది రెబెక్కా.

ఆమె తన వేనిటీ బాగ్‌లోంచి ఓ ఫారిన్ సిగరెట్ పాకెట్ తీసి ముందుగా అందరికీ ఆఫర్ చేసింది. రావుగారూ, సుధాకర్ గారూ సున్నితంగా నిరాకరించారు. ఆమె లైటర్‌తో వాటిని వెలిగించి తనూ ఒకటి ముట్టించుకుంది. ఓ సిప్‌చేసి గ్లాసు కిందపెట్టి ఓ దమ్ములాగి పైకి వదిలి అందరివంకా అదో మందహాసంతో చూసింది.

గులాబీ పూవులో మకరందం బదులు ఓ అగ్నికీల జ్వలిస్తున్నట్టు... ఆ మృదువైన పెదాల మధ్య ఎర్రగా రగిలే సిగరెట్టు–

సుధాకర్‌గారూ! మార్క్సు రూపొందించిన ''గ్లాస్ ఆఫ్ వాటర్ థియరీని ఏంగెల్స్ ఎందుకు వ్యతిరేకించినట్టు?''

బహుశ ఏంగెల్స్ మిసెస్ రెబెక్కాను చూసుండరు.

ఔనౌను... మార్క్సు రెబెక్కాను చూసేకే ఆ సిద్ధాంతం పుట్టుకొచ్చుంటుంది.... అని సరిదిద్దుకున్నారు రజనీగారు.

గులాబీ రంగు పెదవుల్నీ, తెల్లని మేనునీ, మెరిసే నీలి కళ్లనీ....

మిసెస్ రెబెక్కా.... జర్మన్ యువతుల్లో నీవు అందగత్తెల్లో లెక్కేనా?

మీరలా నన్నెందుకు అడుగుతున్నారు?

మా అందరి కంటికీ నీవు చాలా అందగత్తెలా కనిపిస్తున్నావు.

రెబెక్కా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ మరుక్షణమే తలవంచుకుని ముసిముసి నవ్వులు నవ్వుకుంది. అతడికి తెలుసు, తన మాట మంత్ర మౌతుందని.


ఆమె అందరివంకా తేరిపార చూసింది. ఆమె తన రెండు చేతులూ ముందుకు చాపి... మీ ఇండియన్సుకు ఈ వైట్ స్కిన్ అంటే క్రేజీ... అందుకే నేను మీ కంటికి అందంగా కనిపించి వుంటాను... దట్సాల్! అంది.

యు ఆర్ గ్రేట్ రెబెక్కా.... నిజాన్ని నిర్మొహమాటంగా చెప్పావు.

రజనీగారూ! మిసెస్ రెబెక్కా కేవలం ఓ అందమైన స్త్రీలా కాక హృదయంలోని స్వచ్ఛమైన ఆనందానికి ప్రతిరూపం ఆమె అన్నారు రావుగారు.

మిసెస్ రెబెక్కా.... మీ కోసమే ఎదురు చూస్తున్నాం. అది ఫినిష్ చేసి గ్లాసివ్వండి... ఆఖరి రౌండు వేస్తాను అన్నాడు వెంకటేశు.

నాకిది చాలు. చివరివరకూ దీంతో మీకు కంపెనీ ఇవ్వగలను అని ఆమె మరో సిప్‌చేసి, మరో దమ్ము లాగి హాయిగా గాలిలోకి రింగులు వదిలింది. అవి



వలయాల్లా పై పైకి తేలుతూ పైని ఎక్కడో తెరమరగౌతున్నాయి.

వెంకటేశు అందరికీ సమానంగా పంచి గ్లాసులు అందించాడు. సుధాకర్‌గారు గ్లాసులు మారిపోయాయే అంటూ అందుకున్నారు.

ఎంగిలి పట్టింపులు ఆఖరి రౌండులో ఉండవు అన్నాడు వెంకటేశు. ఇది గ్లాస్ ఆఫ్ లిక్కర్ థియరీ అన్నారు రజనీగారు. అంటే గ్లాసులు మారిపోవటం అన్నమాట అన్నాడు వెంకటేశు. అప్పుడు రజనీగారు ఒక్క గ్లాసులు మారి పోవటమేమిటి... ఇంకా చాలా మారిపోతాయి. మనలో ఎవరైనా 'నల్ల తోలు' కథ చదివిరా?

నల్ల తోలు... కాంట్రాస్ట్ బాగుంది... అని రెబెక్కా వంక చూశారు. ఆ చెప్పండి రజనీగారు, కథలోని విశేషమేమిటో...

ఇండియాను బ్రిటిష్‌వాళ్లు ఏలే రోజుల్లో వీకెండ్ వస్తే చాలు బ్రిటిష్ ఆఫీసర్లు, టీ ఎస్టేటు మేనేజర్లు కాన్ఫరెన్సు హాల్సుకు వెళ్లి అర్ధరాత్రి వరకూ తినీ, తాగీ, బాల్‌రూమ్ డాన్సులు చేసి ఎంజాయ్ చేసేవారట. ఆఖరి రౌండులో గ్లాసులు మారిపోవడం ఎంత సహజమో, వాళ్లతో వచ్చిన వాళ్ల భార్యలు మారి పోవటమూ అంత సహజమట అక్కడ... మార్క్స్ చెప్పిన 'గ్లాసీ ఆఫ్ వాటర్' థియరీలా ఇది 'గ్లాస్ ఆఫ్ లిక్కర్' థియరీ యేమో...

అప్పుడు రావుగారు రెబెక్కా వంక చూసి, అరె మనమే మాట్లాడుకుంటున్నాం... ఆమెకు ఒక్కముక్క అర్థం కాదు... ఆమెను కూడా మనమాటల్లో కలపాలి కదా అన్నారు. వెంటనే సుధాకర్‌గారు మిసెస్ రెబెక్కా! మీ హాబీస్ ఏమిటో తెలుసుకోవచ్చా అన్నారు.

వావ్ మై హాబీస్!!

ఏం? అభ్యంతరమా!

అభ్యంతరానికి ఇందులో ఏముంది?! ప్రపంచ దేశాన్ని చూడ్డం, యోగా నేర్పడం, మ్యూజిక్... డాన్స్... దట్సాల్.

మ్యూజిక్ మీ హాబీయా? అయితే మాకోపాట వినిపించాల్సిందే...

నేనా? పాటా?! ఇట్స్ నో గుడ్-

ఇప్పుడే కదా అన్నారు మ్యూజిక్ మీ హాబీ అని.

జర్మన్‌లో పాడగలను.... కాని మీకెవ్వరికీ జర్మన్ భాష రాదు. ఇంగ్లీషులో నాకు పాటలు రావు.

సంగీతానికి భాష అవరోధం కాదు. మీరు జర్మన్ లోనే పాడండి.

రెబెక్కా ఓ అందమైన పాట వినిపించింది. ఆర్ద్రతతో కూడిన ఆ పాట వాళ్ల హృదయాల్ని ఆకట్టుకుంది. వండర్‌ఫుల్... వండర్ ఫుల్ అంటూ అందరూ అభినందించారు.

థాంక్యూ... థాంక్యూ.... అంటూ అందరినీ పరికించింది. అభినందనకు తపించని హృదయముండదు కదా.

అందరూ 'మరొక్క పాట' అన్నారు.

ఆమె సంకోచించలేదు. ఇందాకటి కన్నా ఇప్పుడు మరింత హాయిగా, హృద్యంగా పాడింది.

ప్రశంసల జల్లు.

ఆమె తన గ్లాసునందుకుని చివరి సిప్ చేసేసి ఖాళీ పేపర్ గ్లాసును చిదిమేసింది. దానిని ఎక్కడ పడవేయాలో తెలియక అటూ ఇటూ కలియచూసి చివరకు తన వేనిటీ బాగ్‌లోనే కుక్కుకుంది. మనసులో పొందే ఆనందాతిశయానికి మాటలు రాక కాబోలు రెబెక్కా ఆ నలుగురి దగ్గరకూ వెళ్లి చెక్కిలి మీద ఒక్కొక్క చిరు ముద్దు నిచ్చింది.

దీపస్తంభం మీది దీపం గుప్పున వెలిగి ఆరిపోయినట్టు ఆమె ''థాంక్స్'' అంటూ చెప్పి అక్కడి నుండి నిష్క్రమించింది.

ఆ నలుగురూ కొద్ది క్షణాలపాటు చేతలుడిగి చకితులయ్యారు. ఆ మత్తులో ఒకపాటి పారవశ్యంతో ఏదో అసాధారణత కోల్పోయిన వారిలా అక్కడ మిగిలి పోయారు.

అప్పుడు రావుగారు సావధానంగా అన్నారు. మానవ జాతి మౌలిక విలువలన్నీ ఒకటే అయినా రెబెక్కాను ఆమె జాతీయ విలువల్తో అర్థం చేసుకోవాలే గాని, మన జాతీయ విలువల్తో కొలవటం సరికాదు అని. అప్పుడు రజనీగారు, ఔనౌను.... భౌతిక విషయాల్లోంచి మనం ఆనందాన్ని కోరుకుంటున్నాం గానీ, మనిషిలోని సహజస్థితే ఆనందానికి కారణం అన్నారు.

బయట ఝుమ్మంటున్న చిమ్మచీకటి. కీచురాళ్ల రొద.

రైలు కదిలిన కుదుపేదో వాళ్లను పరాకుగా స్పర్శించింది. కంపార్టుమెంటులోని లైట్లు కొద్దిగా వెలుగు పుంజుకున్నాయి.

బెర్తుల మీది వస్తువులు అస్తవ్యస్థంగా పడి ఉన్నాయి. నైట్ మీల్స్ ఎప్పుడు వచ్చాయో అవీ అక్కడే పెట్టి వున్నాయి. వాటిని ఎవరు ఎప్పుడు ఎలా ఆరగించారో, బెర్తుల మీదకు ఎలా చేరుకున్నారో, నిద్ర మత్తులో, మత్తులో బరువెక్కిన కళ్లు ఎప్పుడు మూతపడ్డాయో వాళ్ళెరుగరు.

జంతువును మింగిన కొండచిలువ నెమ్మదిగా పక్కటెముకలు పటపటా విరుచుకుంటూ ముందుకు సాగినట్టుగా రైలు నెమ్మదిగా కదిలింది. వేగాన్ని పుంజుకుంది. స్తబ్దతని తరిమేస్తూ తెల్లవారే దిశగా ముందుకు సాగిపోయింది.

***

భళ్లున తెల్లవారింది.

ఆహ్లాదకరమైన ఉషస్సు ధవళ వస్త్రంలా భూతలాన్నంతటినీ కప్పేసింది. శశాంక పార్థివకాయం ఎదురుగా ఓ ఎత్తయిన వేదికమీద చక్కగా అలంకరించబడి వుంది.

అక్కడ కొందరు పాత మిత్రులున్నారు. కొత్తగా దగ్గరయిన మరికొందరు మిత్రులూ వున్నారు. దూరమైన ఒకనాటి పాత మిత్రులూ వున్నారు. అందరితో పాటు రావుగారూ, రజనీగారూ, వెంకటేశం, సుధాకర్‌గారూ... అందరూ ఉన్నారు.

పడమటి నుండి తెరలు తెరలుగా వీచే శీతగాలి ఒక్కసారిగా రెపరెపలాడింది. చెట్టు మీంచి గలగలా రాలిన పండుటాకులు శశాంక నుంచిన పాడి మీద కూడా రాలి పడ్డాయి. చెట్టుకేసి చూస్తే కొమ్మల్లో మొలకెత్తే లే చిగుళ్లు.

శీతగాలిని తరిమేస్తూ లేలేత సూర్యకిరణాలు భూమ్మీద పరచుకున్నాయి. ఆ కిరణకాంతిలో శశాంక ముఖంలోని వికాసం చూసిన కొందరు మిత్రులు అద్భుతంగా వుందికదూ అని అనుకోసాగారు.

ఔను! ఎందువలన... ఎవరో ప్రశ్నించారు.

జీవితాన్ని జీవితంలా గడిపినవాడు కదా మరి - జవాబు.

అంటే...

ఏ ఈప్సితాలు లేకుండా బతకటం...

అతడు ఆస్తిని కూడబెట్టలేదు... చనిపోయే ముందు దానిని నిలబెట్టగల వారసులు లేరనే దిగులుతో చావలేదు. నిరుద్యోగియైన కొడుకు లేడు. అతడెలా బతుకుతాడనే బెంగలేదు. పెళ్లి కాని కూతురు లేదు, అతని మరణానంతరం తన భార్య ఏ పంచకు చేరాలన్న దిగులు లేదు. అతడు నిజానికి పెళ్లి చేసుకోలేదు.

ఏ బాధ్యతలూ లేకుండా మరణించడమే అతని ముఖంలోని వికాసానికి కారణం, అన్నారు.

అయితే ఆయనకు దేవుడున్నాడా? తిరిగి ప్రశ్న-

జ్ఞానమే దేవుడని అతడి నమ్మకం.

ఆ మాట ఇంతకుముందు కూడా చాలామంది చెప్పారుకదా... భూమి మీద 'భయం' ఉన్నంతకాలం ఆకాశంలో దేవుడుంటాడని అరిస్టాటిల్ అనలేదా... ఆలోచనే దేవుడు అని కూడా అయనన్నాడు.

అయితే జ్ఞానం, విజ్ఞానం వుంటే 'దేవుడు' అవసరం లేదా?

మన ముందున్న మిత్రుడు శశాంక జీవితమే దానికి సరైన జవాబు.

ఎక్కడో మారుమూల గ్రామంలో పుట్టి ఏకాంతం కోసం జనారణ్యానికి వచ్చి ఇక్కడ మరణించాడు. అతడు పుట్టినప్పటి నుండి మరణించే వరకూ నడిచి వచ్చిన దారి బహు సరళమైనది. అయినా ఆ దారిని నడవడానికి ఎవరూ సాహసించరు.... ప్రలోభాలతో ఏ మనిషీ ఆ దారిని నడవలేడు... అని వారక్కడ ఒకరికొకరు అనుకొనుచుండగా రావుగారు, రజనీగారికేసీ, సుధాకర్ గారికేసీ తిరిగి మన మిత్రుడు శశాంక జీవితం 'ఒక ప్రహేళిక' అని చెప్పి అందరితో పాటు మహాప్రస్థానం వేపు కదిలారు.

*

## పరిపూర్ణంగా జీవితాన్ని చూశాక..



ఒక రకమైన జీవిత వాస్తవాలకు అగ్రస్థానం ఇచ్చి జీవిత సత్యాన్ని బయట పెట్టడం ఈ కథ ముఖ్య లక్ష్యం. జీవితాన్ని పరిపూర్ణంగా చూసిన వ్యక్తికి మరణం కంటే కోరదగినదేముంటుంది. ఈ కథ 'డిడాక్టిసిజమ్' ఆలంబనగా మలచబడింది.

'నవ్య' యాజమాన్యానికీ, సంపాదకులకూ నా నమస్సులు.

-ముప్పిడి ప్రభాకరరావు
**46-18-25/1, దానవాయిపేట**
**రాజమండ్రి - 533103**
**సెల్ : 9000256591**